# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఈ సంవత్సరం 81.14 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- ❖ జమ్మూ కాశ్మీర్ లో నిన్న జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం ప్రకటించారు.
- ❖ పర్యాటకుల భద్రత మేరకు శ్రీనగర్ నుంచి ప్రత్యేక విమాన సర్వీసులను నడుపుతున్నామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.
- ❖ ఉత్తరాంధ్ర ప్రయోజనాల కోసమే పోలవరం ఎడమ కాలువను నిర్మిస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
- ❖ మత్స్యకార భరోసా పథకాన్ని ఈ నెల 26వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకాకుళంలో ప్రారంభించనున్నారు.

==============================

పదవ తరగతి పరీక్ష ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి. ఈ సంవత్సరం 81.14 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పరీక్షలకు మొత్తం 6,14,459 మంది విద్యార్థులు హాజరుకాగా.. వారిలో 4,98,585 మంది ఉత్తీర్ణులయ్యారని విద్యా శాఖా మంత్రి మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ పరీక్షా ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా వరుసగా మూడవ సారి ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాలో మొత్తం 10,286 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 9,659 మంది ఉత్తీర్ణత పొంది 93.90 శాతంతో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించింది. ఇక అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో నిలిచింది. 1,680 పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి. మే 19 నుంచి 28 వరకు పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నారు.

==============================

ఉగ్రవాద చర్యలు సమాజంపై మాయని మచ్చ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. జమ్మూ కశ్మీర్‌లో నిన్న జరిగిన పహల్గాం ఉగ్రదాడి పై ఆయన సామాజిక మాధ్యమంలో స్పందిస్తూ... ఈ దారుణమైన చర్యకు బాధ్యులైన వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికైనా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు

ఉంటుందని పేర్కొన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన  రాష్ట్ర వాసులు చంద్రమౌళి, మధుసూదన్‌లకు సంతాపం ప్రకటించారు.

==============================

జమ్మూ కశ్మీర్‌లోని నిన్న జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో పర్యాటకుల భద్రత మేరకు శ్రీనగర్ నుంచి ప్రత్యేక విమాన సర్వీసులను ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. నాలుగు ప్రత్యేక విమానాలు శ్రీనగర్ నుంచి ముంబయి, ఢిల్లీ నగరాలకు చేరుకుంటాయని తెలిపారు. కాశ్మీర్ లోని ఇతర ప్రాంతాలలో చిక్కుకున్న పర్యాటకులు తిరుగు పయనమవుతున్నారని అవసరమైతే వారి కోసం మరిన్ని విమానాలు నడపడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా అన్ని విమానయాన ఆపరేటర్లతో మంత్రి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ కష్ట సమయంలో ప్రయాణికులపై భారం పడకుండా.. సాధారణ స్థాయి ఛార్జీలను వసూలు చేయాలని విమానయాన సంస్థలను ఆదేశించారు. ఇక కశ్మీర్‌లో చిక్కుకున్న తెలుగు రాష్ట్రాల ప్రజలు సురక్షితంగా తిరిగి రావడంలో సహాయం చేయడానికి ఢిల్లీలోని ఆంధ్రభవన్‌లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన విశాఖపట్నం వాసి చంద్రమౌళి కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడారు. మృతదేహాన్ని విమానంలో తీసుకురావడానికి ఏర్పాట్లు చేశామని చెప్పారు.

==============================

ఉత్తరాంధ్ర ప్రయోజనాల కోసమే పోలవరం ఎడమ కాలువను నిర్మిస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విశాఖ పర్యటనలో ఉన్న ఆయన ఈరోజు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్ట్ బహుళ ప్రయోజనాలు, నదుల అనుసంధానం నెరవేరాలంటే 45.72 మీటర్ల ఎత్తు వద్ద డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టాలని అన్నారు. గత ప్రభుత్వం నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని తెలిపారు. నిర్వాసితులకు నష్ట పరిహారం అందించి 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

==============================

మత్స్యకార భరోసా పథకాన్ని ఈ నెల 26వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభించనున్నారు. జిల్లాలోని ఎచ్చెర్ల నియోజకవర్గం బుడగట్లపాలెం గ్రామంలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో లబ్దిదారులకు నగదు పంపిణీ చేయనున్నారు. ఈ సభా ఏర్పాట్లను రాష్ట్ర మత్స్య శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ.. నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లూ తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భద్రతా బలగాలు అప్రమత్తంగా వుండాలని, నిబంధనల మేరకు వాహనాల అనుమతిని సంబంధిత నియమాలను పాటించాలని మంత్రి తెలిపారు.

==============================

ఈరోజు విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో పల్నాడు జిల్లా ఒప్పిచర్ల గ్రామంలోని  జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పావని చంద్రిక 600 మార్కులకు గాను 598 మార్కులు సాధించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి అత్యధిక మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన పావని చంద్రికను జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అభినందించారు. భవిష్యత్ లో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నానని చెప్పారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉత్తీర్ణత సాధించాయని, కూటమి ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తోందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు.

విరామం

==============================

గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వైయస్సార్ కడప జిల్లాలో విజయవంతంగా అమలవుతోంది. ఒకవైపు ప్రజలకు పని కల్పించడంతో పాటు, భూగర్భ జలాలను పెంచడం, వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవడం లాంటి కార్యక్రమాలు ఈ పథకం ద్వారా అమలు చేయబడుతున్నాయి. వైయస్సార్ కడప జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరానికి 70 లక్షల ఉపాధి పని దినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పథకం ద్వారా విరివిగా ఉపాధి దొరకడం వలన వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నామని నరసింహులు అనే ఉపాధి కార్మికుడు ఆకాశవాణితో మాట్లాడుతూ..

(వాయిస్ 20 సెకన్లు)

==============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

==============================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరికాసేపట్లో విశాఖపట్టణానికి రానున్నారు. జమ్ము కాశ్మీర్ లోని అనంతనాగ్ జిల్లాలో నిన్న జరిగిన ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన విశాఖపట్టణానికి చెందిన విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి చంద్రమౌళి పార్థివ దేహానికి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు.

==============================

రాష్ట్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కోటి 20 లక్షల మందికి ప్రమాద బీమా సౌకర్యాన్ని వర్తింప చేసేందుకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ సన్నాహాలు చేస్తుంది. ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఇటీవల చేసిన సూచనల మేరకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం ద్వారా ప్రీమియం చెల్లింపు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వారికి బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టామని.. అందులో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో సుమారు 4,88,783 మందికి ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి బీమా సౌకర్యం కల్పిస్తుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు పి. సుధాకర్ రావు చెప్పారు. ఉపాధి హామీ కార్మికుల వివరాలతో కూడిన జాబితాలను ఆయా గ్రామాల్లో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు బ్యాంకులో నమోదు చేయించాలన్నారు.

==============================

ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులను చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఈరోజు ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో చెరకు పంట ప్రధాన పంటగా ఉందని.. దానికి బదులుగా మార్కెట్ లో వంట నూనెలకు అధిక డిమాండ్ ఉన్న దృష్ట్యా ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఆదాయం మెండుగా పొందవచ్చని పంట నష్టం కూడా చాలా తక్కువగా ఉంటుందన్నారు. జిల్లాలో కార్వేటినగరం, జి.డి.నెల్లూరు, నింద్ర, నగరి, విజయపురం, ఎస్. ఆర్. పురం మండలాలలో ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ఉన్నాయని ఆయన వెల్లడించారు.

==============================

రాష్ట్రంలో దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో  రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో పాటు కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ అధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

==============================

==============================